# ప్రజాశక్తి

శుక్రవారం 28 జూన్ 2024 | 8 పేజీలు



గుంటూరు



పల్నాడు


# మొక్కుబడిగా కాల్వల మరమ్మతులు

## సీజన్ ప్రారంభమైనా టెండర్ల ఖరారు దశలోనే యంత్రాంగం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు ఛానల్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క (ఫైల్)

కృష్ణా పశ్చిమ డెల్టాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నెల రోజులకు నీటి పారుదల పనులు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మే నెలాఖారుకు పూర్తి కావాల్సిన పనులు జులైలోనే ప్రారంభమవుతున్న పరిస్థితి నెలకొంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 240 పనులకు రూ.22 కోట్ల అంచనాలతో గత ఫిబ్రవరిలోనే అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఎన్నికల ముందు ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు.

గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని డెల్టా ప్రాంతంలో 5.70 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఎగువ నుంచి విడుదల చేసే నీటిని డెల్టాలోని చివరి భూములకు నీరందేలా కాల్వలు, మురుగు కాల్వలు శుభ్రం చేయాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు నిధుల్లేక ఇప్పటి వరకు పనులు చేయించలేదు. అయితే పలు తర్జన భర్జనల అనంతరం ఇటీవల జలవనరులశాఖ నుంచి మరమ్మతులకు రూ.13.62 కోట్లు మంజూరవడంతో పనులకు టెండర్లు పిలిచేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. తెనాలి డివిజన్‌లో 85 పనులకు రూ.రూ.4.98

▶ 2లో



ఫలితాలను విడుదల చేస్తున్న సెట్ కన్వీనర్, వర్సిటీ అధికారులు

# లాసెట్ ఫలితాలు విడుదల

## 89.04 ఉత్తీర్ణత - గతంకంటే మెరుగైన ఫలితాలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 9న జరిగిన ఎపి లాసెట్, ఎపి పిజి ఎల్ సెట్ 2024 ఫలితాలు విడుదలయ్యాయి. వర్సిటీలో లా సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి.సత్యనారాయణ తదితరులు గురువారం ఫలితాలను విడుదల చేశారు. 19,224 మంది పరీక్ష రాయగా 17,117 మంది (89.04 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇందులో రెండేళ్ల పీజీ కోర్స్‌లో 99.51 శాతం, మూడేళ్ల ఎల్ఎల్‌బి కోర్సులో 89.74 శాతం, ఐదేళ్ల ఎల్ఎల్‌బి కోర్సులో 80.06 శాతం ఉతీర్ణత సాధించారు.

రెండేళ్ల పీజీ కోర్సులో పురుషులు 99.51 శాతం, స్త్రీలు 99.51 శాతం ఉతీర్ణత సాధించారు, మూడేళ్ల ఎల్.ఎల్.బి కోర్సులో పురుషులు 91.28 శాతం, స్త్రీలు 86.26 శాతం, ఐదేళ్ల ఎల్ఎల్‌బి కోర్సులో పురుషులు 81.91 శాతం, స్త్రీలు 78.17 శాతం ఉత్తీర్ణత సాధించారు.

▶ 2లో



## వర్సిటీలో ముగిసిన ఏపీ పీసెట్ పరీక్షలు

8 లో

# సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లు

ప్రజాశక్తి-గుంటూరు



వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వచ్చేనె 1న ఉదయం 6 గంటల నుండి లబ్ధిదార్ల ఇంటి వద్దే గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ చెప్పారు. సామాజిక భద్రత పింఛన్ల పంపిణీపై జిల్లా కలెక్టర్లతో గురువారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా పెంచిన పెన్షన్, మూడు నెలల ఎరియర్స్‌తో కలిపి పంపిణీ చేయాలని, అదేరోజు పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలని అన్నారు. ఒక్కొక్క ఉద్యోగి 50 గృహాలు చొప్పున మ్యాపింగ్ చేయాలన్నారు. అదనంగా ఉద్యోగులు అవసరమైతే ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే వినియోగించాలన్నారు. మొత్తం నాలుగు రకాల కేటగిరీల పింఛనుదారులలో, 11 సబ్ క్యాటగిరీలకు చెందిన పింఛనుదారులకు జులై మాసానికి సంబంధించి రూ.4 వేలు, ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలకు సంబంధించిన ఎరియర్స్ నెలకు రూ.వెయ్యి చొప్పున రూ.3 వేలు మొత్తం రూ.7 వేలు పంపిణీ చేయాలన్నారు. మిగిలిన కేటగిరీలకు ప్రస్తుత

▶ 2లో

## లైంగికదాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

ఫొటోల పేరుతో యువతిని లొంగదీసుకొని లైంగికదాడి చేసిన కేసులో యువకునికి పదేళ్ల జైలు, రూ.53 వేల జరిమానా విధిస్తూ గుంటూరు ఐదవ అదనపు జిల్లా జడ్జి కె.నీలిమ గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. తాడేపల్లిలోని ముగ్గురోడ్‌కు చెందిన తాతపూడి అనిల్ కుమార్ తాను నివసిస్తున్న ఇంటి ఎదురుగా నివసిస్తున్న 19 ఏళ్ల యువతికి కనిపించినప్పుడల్లా హాయ్ చెపుతూ వుండేవాడు. ఒక రోజు ఆమెను కలిసి తనదగ్గర ఆమె ఫొటోలు ఉన్నాయని తన ఇంటికి వస్తే వాటిని చూపుతామని చెప్పి తీసుకెళ్లాడు. అనంతరం ఆమెను లొంగదీసుకుని లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమెతో ఫొటోలూ తీసుకున్నారు. అనంతరం వాటిని అడ్డుపెట్టుకొని ఆమెను కొంతకాలం భయపెట్టాడు. తర్వాత ఆమె అతని ఫోన్ తీసుకుని ఆ ఫొటోలను డిలీట్ చేశారు. తర్వాత కొంత కాలానికి ఆ ఫొటోలు తన భార్య రికవర్ యాప్ ద్వారా మళ్లీ రికవర్ చేసిందని చెప్పాడు. వాటిని సోషల్ మీడియాలో పెడతానంటూ 2020 జనవరి 1న బెదిరించి యువతిని బైక్‌పై ఎక్కించుకొని విజయవాడలోని ఓ హోటల్‌కు తీసుకెళ్లాడు. అదే సమయంలో అనిల్ కుమార్ భార్య ఆ హోటల్‌కు వచ్చి యువతిని కొట్టి పోలీసులకు ఫోన్ చేయగా పోలీసులు వచ్చి అందర్నీ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అనిల్ కుమార్ తనను బెదిరించి అత్యాచారం చేసినట్లు యువతి ఫిర్యాదు చేయగా వారు ఆ ఫిర్యాదును తాడేపల్లి పోలీస్ స్టేషన్‌కు పంపడంతో కేసు నమోదైంది. దర్యాప్తు అనంతరం సిఐ బి.అంకమ్మరావు కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో ఏపీపీ పల్లపు కృష్ణ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. అనిల్ కుమార్‌పై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

## నేడు లండన్ నుండి కోనూరుకు విద్యార్థి మృతదేహం

ప్రజాశక్తి - అచ్చంపేట



మృతుడు సాయిరాం (ఫైల్)

కడుపుకోతతో తీవ్ర దుఃఖంలో ఉన్న తల్లికి స్వచ్ఛంద సంస్థ ద్వారా కొడుకు ఆఖరి చూపులు దక్కనున్నాయి. విదేశాల్లో చనిపోయిన విద్యార్థి మృతదేహాన్ని స్నేహహస్తాలు ఫౌండేషన్ మృతుని స్వగ్రామమైన అచ్చంపేట మండలం కోనూరుకు శనివారం చేరుకోనుంది. వివరాల ప్రకారం.. కోనూరుకు చెందిన గుంటుపల్లి, ఏడుకొండలు, అన్నపూర్ణమ్మ దంపతుల కుమారుడు సాయిరామ్ మూడేళ్ల క్రితం ఉన్నత చదువుల నిమిత్తం లండన్ వెళ్లాడు. అప్పటికే తండ్రి చనిపోవడంతో జీవనాధారమైన పొలాన్ని అమ్మి ఆ సొమ్ముతో లండన్‌కు చదువుకోవడానికి వెళ్లాడు. చదువులు పూర్తి చేసుకుని ప్రయోజకుడై కొడుకు తిరిగి వస్తాడని కోటి ఆశలతో ఎదురు చూస్తున్న తల్లికి అకస్మాత్తుగా కుమారుడు మృతి చెందానే వార్త తెలిసి తల్లడిల్లింది. ఈనెల 2వ లండన్‌లోని బీచ్‌లో అలల ఉధృతికి సాయిరాం మృతి చెందాడు. కొద్దిరోజుల తర్వాత బంధువులకు సమాచారం అందింది. మృతదేహాన్ని తెప్పించుకునే ఆర్థిక స్తోమత ఆ కుటుంబానికి లేదనే విషయాన్ని స్నేహహస్తాలు ఫౌండేషన్ తెలుసుకుంది. వెంటనే లండన్‌లోని ఉన్న అరుణ్ ముమ్మలనేని (మేయర్ - హ్యాంప్‌షైర్ కౌంటీ) ద్వారా సాయిరామ్ మృతదేహాన్ని ప్రత్యేక విమానంలో శనివారం బేగంపేట విమానాశ్రయానికి పంపిస్తున్నారు. అక్కడ నుండి ప్రభుత్వం ద్వారా అంబులెన్స్‌లో కోనూరుకు తరలిస్తారని స్నేహహస్తాలు ఫౌండేషన్ ప్రతినిధి తాయి కరిముల్లా బాబు తెలిపారు.

# కౌల్దార్లకూ రూ.20 వేలు ఇవ్వాలి

### అర్హులైన కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి

### కౌలురైతు సంఘం డిమాండ్

### గత ప్రభుత్వం చేసిన తప్పులను ఈ ప్రభుత్వమూ చేయొద్దని సూచన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీ మేరకు 'అన్నదాత సుఖీభవ' పథకం కింద ఇచ్చే రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని వాస్తవ సాగుదార్లయిన కౌలురైతులకూ ఇవ్వాలని ఏపీ కౌలు రైతుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కామినేని రామారావు, వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. గత ప్రభుత్వం వైఎస్ఆర్ రైతు భరోసా కింద ఇచ్చే రూ.13,500ను తాజా ప్రభుత్వం పెంచి ఇస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. గత ప్రభుత్వం వాగ్దానాన్ని విస్మరించి కేంద్రం ఇచ్చే రూ.6 వేలు కలిపి పెట్టుబడి సహాయం అమలు చేసిందంటూ టిడిపి గత ఐదేళ్లుగా విమర్శించిందని, ఇప్పుడు ఆ పార్టీ ప్రభుత్వమూ ఆ తప్పు చేయకుండా కేంద్రం సహాయం రూ.6 వేలతో సంబందం లేకుండా రూ.20 వేలను ఇవ్వాలని, ఈ మేరకు విధివిధానాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ ప్రారంభం నేపథ్యంలో ఈ సాయాన్ని సత్వరం అందించాలని కోరారు. కౌలు రైతులను గుర్తించి వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రభుత్వ సంక్షేమ పథకాలనూ వారికే అందిస్తామనే వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. పల్నాడు జిల్లాలో 65 వేల

▶ 2లో



ఇవిఎం గోదాము వద్ద కలెక్టర్, డిఆర్‌ఒ తదితరులు

## ఇవిఎంల గోదామును సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదాములను గురువారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. గోదాము భద్రత గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, కలెక్టర్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.


విరాళం అందిస్తున్న ఎన్‌ఆర్‌ఐ పచ్చల రమేష్

## కళాశాల అభివద్ధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

మండల కేంద్రమైన పెదనందిపాడులోని పిఎఎస్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు, విశ్రాంత ఎఎస్‌పి కాళహస్తి సత్యనారాయణ అమెరికాలో ఉన్న తన సహ విద్యార్థి తాడికొండ మండలం పొన్నెకల్లుకు చెందిన ఎన్‌ఆర్‌ఐ పచ్చల రమేష్‌ను ఇటీవల కలుసుకున్నారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో చార్టెడ్ అకౌంటెంట్‌గా స్థిరపడిన రమేష్‌కు కాళహస్తి సత్యనారాయణ పెదనందిపాడు ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీ బుక్‌లెట్‌ను అందజేశారు. కళాశాలలో జరుగుచున్న అభివద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకొని కళాశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళంగా రమేష్ అందజేసినట్లు సత్యనారాయణ తెలిపారు. పచ్చల రమేష్‌కు సత్యనారాయణతో పాటు పెదనందిపాడు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీరరాఘవయ్య వైస్ ప్రిన్సిపాల్ ప్రతాప్ కుమార్, కళాశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

## లాసెట్ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

మూడేళ్ల కోర్సులో తిరుపతికి చెందిన యామల కృష్ణచైతన్య 104 మార్కులతో ఫస్ట్ ర్యాంక్ సాధించగా కోనసీమ జిల్లాకు చెందిన కె.హర్షవర్ధన్‌రాజు 103 మార్కులతో రెండవ ర్యాంకు, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన చెల్లుబోయిన రేవంత్ రాయ్ 98 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు.

ఐదేళ్ల కోర్సులో విజయనగరం జిల్లాకు చెందిన కుసుమ అగర్వాల్ 92 మార్కులతో మొదటి ర్యాంక్‌ను కౌవసం చేసుకోగా తెలంగాణకు చెందిన ఆర్.పి. విజయనందిని 91 మార్కులతో రెండవ ర్యాంక్, విజయవాడకు చెందిన గోపిసెట్టి విజయ ఆదిత్య శ్రీవాస్తవ 88 మార్కులతో మూడో ర్యాంకు దక్కించుకున్నారు. రెండేళ్ల కోర్సులో పొట్లూరి అభినీట్ జసన్ 96 మార్కుతో మొదటి ర్యాంకు, గుంటూరు జిల్లాకు చెందిన దీప్తి నూకాల 95 మార్కులతో రెండవ ర్యాంకు, విజయవాడుకు చెందిన నువ్వుల జాహ్నవి 94 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు.


ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

## పింఛన్లను నిబంధనల ప్రకారమే పంపిణీ చేయాలి

జిల్లాలో వచ్చేనెల ఒకటిన ప్రభుత్వ నిబంధనల మేరకు సామాజిక పింఛన్లను పూర్తిస్థాయిలో అందించాలని మండల అధికారులు, మునిసిపల్ కమీషనర్లను పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ ఆదేశించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి మునిసిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అధికారులు, డిఎలఒలు, ఎంపిఎఒలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్షించారు. జిల్లాలో 2,82,126 మంది పింఛన్లు పొందుతున్నారని, అందుకు సంబంధించి రెగ్యులర్ పింఛన్ల కింద రూ.120 కోట్లు, అరియర్స్ కింద మరో రూ.71 కోట్లు ఆయా బ్యాంక్‌లలో ఉంచినట్లు చెప్పారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పథకం కింద జూలై 1వ తేదీన పెన్షన్ల పంపిణీ కోసం శనివారం బ్యాంకుల ద్వారా నిధులు విత్ డ్రా చేసుకోవాలని చెప్పారు. అవసరమైతే ఆదివారం కూడా నిధులు డ్రా చేసుకునే విధంగా సంబంధిత బ్యాంకర్లతో మాట్లాడుకోవాలన్నారు. ఒక్కొక్క సచివాలయ సిబ్బంది 50 మందిని మ్యాపింగ్ చేయాలని, శుక్రవారంలోపు వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా పెండింగ్ ఉన్న మ్యాపింగ్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. పెన్షన్ల పంపిణీ, నిధులు డ్రా చేసుకునే సమయంలో అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట అదనపు సిబ్బందిని, వివిధ వివిధ శాఖల నుండి డిప్యూటేషన్ మీద తెచ్చి పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. పింఛన్ల పంపిణీ అనంతరం లబ్ధిదారుల నుంచి అక్నాలెడ్జ్మెంట్ తీసుకోవడం జరుగుతుందన్నారు. పెన్షన్ల పంపిణీ కోసం మండల స్థాయిలో అధికారులంతా అందుబాటులో ఉండాలని సూచించారు. పంపిణీలో వాలంటీర్లను వినియోగించరాదని, ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే ఇవ్వాలని స్పష్టం చేశారు. మునిసిపల్ కమీషనర్లు, మండల అధికారులు వారి పరిధిలో గల సచివాలయాల్లో ఎంత మంది పింఛన్లు పొందుతున్నారు, పంపిణీకి అవసరమైన సిబ్బంది వివరాలు సిద్ధం చేసుకోవాలని, శనివారం సాయంత్రానికి అన్ని వివరాలు ఉండాలని ఆదేశించారు. సమీక్షలో డిఆర్‌డిఎ పీడీ బాలూనాయాక్, జిల్లా వ్యవసాయ అధికారి మురళి పాల్గొన్నారు.

# సమాచార హక్కు కార్యకర్తపై కత్తులతో దాడి

## ఇళ్ల కూల్చివేతలో వివాదం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు




ఇంటిని కూలుస్తున్న పొక్లెయినర్, దాడిలో గాయపడిన కమ్మ శివప్రసాద్ (ఇన్‌సెట్)

ఇళ్ల కూల్చివేత విషయంలో సమాచార హక్కు కార్యకర్త, టిడిపికి చెందిన కమ్మ శివప్రసాద్‌పై ఇద్దరు కలిసి కత్తులతో దాడి చేసిన ఘటన నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ప్రత్తిపాడులోని తాగునీటి చెరువు ఆక్రమణకు గురైందంటూ పదేళ్ల క్రితం సమాచార హక్కు కార్యకర్త అయిన మండలంలోని గొటిపాడుకు చెందిన పచ్చల కోటేశ్వరరావు లోకయుక్తలో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి అక్రమణదారులకు నోటీసులు వస్తున్నాయి. కొంతకాలానికి కోటేశ్వరరావు మృతి చెందారు. అనంతరం చెరువు ఆక్రమణలపై కమ్మ శివప్రసాద్ ఫిర్యాదులు చేస్తూ వస్తున్నారు. కొన్ని సందర్భాల్లో చెరువు స్థలంలోని ఇళ్లను కూల్చాలని అధికారులు ప్రయత్నించినా ఆ గృహాల్లో నివాసం ఉండేవారు కూడా కోర్టుకెళ్లి స్టే తెచ్చుకున్నట్లు నివాసితులు చెబుతున్నారు. మూణ్ణెల్ల కిందట మళ్లీ లోకాయుక్త నుండి ఇళ్ల కూల్చివేతకు ఆదేశాలు వచ్చాయి. దీంతో గురువారం సాయంత్రం పోలీసులు పొక్లెయినర్ తీసుకెళ్లి ఇళ్లను కూల్చేందుకు సిద్ధమయ్యారు. నాలుగిళ్లలో ఒక ఇంటిని పాక్షికంగా పడగొట్టారు. దీంతో స్థానిక నివాసితులు ప్రతిఘటించారు. తాము 70 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని, ఇళ్లను కూలిస్తే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. కొంతమంది మహిళలు పురుగు మందు తాగుతామంటూ హెచ్చరించారు. ఈలోగా దీనంతటికీ కారణం కమ్మ శివప్రసాద్ అంటూ ఇద్దరు కలిసి శివప్రసాద్ ఇంటికి వెళ్లి కత్తులతో దాడికి దిగారు. శివప్రసాద్ మెడ, కాళ్ల భాగంలో నరికి పరారయ్యారు. రక్తపు మడుగులో పడిపోయిన శివప్రసాద్‌ను స్థానికులు ప్రత్తిపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం 108లో గుంటూరు జిజిహెచ్‌కు, ఆ తర్వాత మరో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదని తెలిసింది. ఇదిలా ఉండగా దాడిలో పాల్గొన్న ఇద్దరిలో ఒకరైన పరేమశ్వరరావు గతంలో వాలంటీర్‌గా పని చేశాడు. శివప్రసాద్ గతంలో వైసిపి పార్టీలో ఉండగా ఎన్నికల సందర్భంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణతో కలిసి టిడిపిలో చేరారు.

## సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం పెంచిన విధంగానే నగదును పంపిణీ చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, డిఆర్‌డిఎ పీడీ హరిహరనాథ్, ఎమ్‌టీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పాల్గొన్నారు.

## కౌల్దార్లకూ రూ.20 వేలు ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

కార్డుల లక్ష్యం కాకుండా ఎంతమంది భూమి లేని కౌలు రైతులుంటే అంతమందికీ గుర్తింపు కార్డులివ్వాలని కోరారు. కౌలు రైతులు సాగు చేస్తున్న పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసి ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరులో అనేక నిబంధనలు విధించి వాస్తవ సాగు రైతులందరికీ పెట్టుబడి సహాయం అందకుండా చేసిందని, భూమి లేని కౌల్దార్లందరికీ ఒకేరకంగా పరిగణించకుండా ఓసీలను మినహాయించిందని, దీంతో అనేకమందికి అన్యాయం జరిగిందని తెలిపారు. అదే తప్పిదాలను ఇప్పటి ప్రభుత్వం చేయకుండా అందరికీ న్యాయం చేయాలని కోరారు.

# మొక్కుబడిగా కాల్వల మరమ్మతులు

(మొదటి పేజీ తరువాయి)


తెనాలి ప్రాంతంలోని ఒ కాల్వ

కోట్లు, రేపల్లె డ్రెయినేజి డివిజన్‌లో 61 పనులకు రూ.3.56 కోట్లు, చీరాల డివిజన్‌లో 37 పనులకు రూ.3.75 కోట్లు, గుంటూరు ఛానల్ పరిధిలో ఆరు పనులకు రూ.1.31 కోట్లు కేటాయించారు.

తూటుకాడ, పిచ్చిమొక్కల తొలగింపుతో పాటు నీరు సాఫీగా పారుదలకు కాల్వలను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కాల్వలకు నీరు విడుదల చేసేలోగా పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం సూచించింది. కొంత కాలంగా కాల్వలకు కనీస మరమ్మతులు లేకపోవడం వల్ల గతేడాది చిన్నపాటి తుపాన్లకు సైతం ముంపు సమస్య వచ్చింది. కాల్వలకు నీరు విడుదల చేసినా చివరి భూములకు నీరు అందక ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ప్రధానంగా మురుగు నీటి పారుదల విభాగంలో కనీస మరమ్మతులు లేకపోవడంతో పొలాల్లోకి నీరు చేరి రైతులకు ఇబ్బందికరంగా మారింది. పొలాల్లోని వర్షపు నీరు బయటకు పంపేందుకు కాల్వలు సక్రమంగా లేక రైతులు గతేడాది ఇబ్బంది పడ్డారు. వెదపద్ధతిలో వరి సాగు చేసిన రైతులకు ముంపు సమస్య వల్ల పైరు మునిగి నానా తంటాలు పడ్డారు.

గతేడాది డిసెంబరులో మిచౌంగ్ తుపాను వచ్చినప్పుడు మురుగునీరు, వర్షపు నీరు కలిసి పలు ప్రాంతాల్లో పైర్లను కభళించాయి. గీతేడాది కూడా మరమ్మతులు తూతూ మంత్రంగా జరిగాయి. అవి కూడా ఆలస్యంగా చేపట్టారు. ఈ ఏడాది కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు టెండర్లు ఖరారు దశలోనే అధికారులు ఉన్నారు. వాస్తవంగా కృష్ణా జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉంటే కనీసం జులై ఒకటి కల్లా డెల్టా కాల్వలకు నీరు విడుదల చేస్తారు. అయితే ఈ ఏడాది ఎగువ ప్రాంతంలోనే జలాశయాలు నీరు లేకపోవడం వల్ల శ్రీశైలం, సాగర్, పులిచింతల జలాశయం నుంచి ఇప్పట్లో నీరు విడుదల చేసే అవకాశం లేదు. అయితే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జులై మొదటి వారంలో పట్టిసీమ నుంచి డెల్టాకు నీరు విడుదల చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టకపోవడం, ఒకవేళ వచ్చేనెలలో పనులు ప్రారంభమైనా అవి ఎంత వరకు పూర్తి అవుతాయి? ఏమేరకు నాణ్యతగా ఉంటాయి? అనే అంశాల్లో రైతులు ఆందోళనగా ఉన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ ఏసురత్నం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



శాసన మండలి సభ్యులు చంద్రగిరి ఏసురత్నం గురువారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసి శుభా కాంక్షలు తెలిపారు. జిల్లా అభి వృద్ధికి కృషి చేయాలని కోరారు.

## డ్రెయిన్లలో తూటి కాడ, గుర్రపుడెక్క తొలగింపునకు రూ.1.10 కోట్లు మంజూరు

### పొన్నూరు డ్రెయినేజీ డిఈఈ ధనలక్ష్మి

ప్రజాశక్తి -పొన్నూరు



పొన్నూరు డ్రెనేజీ సబ్ డివిజన్ పరిధిలోని మేజర్, మీడియం డ్రెన్లలో తూటి కాడ, గుర్రపు డెక్క తొలగించ డానికి రూ 1.10 కోట్లు నిధులు మంజూర య్యాయని పొన్నూరు సబ్ డివిజన్ డ్రెనేజీ డిఈఈ ధనలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గంలో వివిధ ఐదు పనులకు రూ 37.50 లక్షలు కేటాయించారని చెప్పారు. ఈ నిధులతో తుంగభద్ర మేజర్ డ్రెన్, మైనర్, మీడియం యాజలి డ్రెన్, కొండేరు డ్రెన్ లలో తోటి కాడ, గుర్రపు డెక్క తొలగించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. బాపట్ల నియోజకవర్గంలో వివిధ డ్రెన్లలో ఆరు పనులు చేపట్టేందుకు రూ 55 లక్షలు, వేమూరు నియోజకవర్గంలో రూ 8.50 క్షలు, రేపల్లె నియోజకవర్గంలో రూ 10 లక్షలు కడ నిధులు మంజూరయ్యాయని డిఈఈ ధనలక్ష్మి వివరించారు. టెండర్లు ప్రక్రియ పూర్తికాగానే డ్రెన్ల లో తూటికాడ, గుర్రపు డెక్కను రసాయనాలు, కూలీల సహాయంతో తొలగింపు పనులకు శ్రీకారం చుడతామని ఆమె పేర్కొన్నారు.

## లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన పెమ్మసాని, లావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, టిడిపి పార్లమెంటరీ పార్టీనాయకులు లావు శ్రీకష్ణదేవరాయలు గురువారం పార్లమెంటు హాలులో కలిశారు. రెండోసారి స్పీకర్‌గా ఎన్నికయిన సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలిపారు. గత ఐదేళ్ల సభ సమర్థవంతంగా జరగటంలో ఎంత కీలక పాత్ర పోషించారని కొనియాడారు. సభ సాఫీగా సాగటంలో తెలుగుదేశం పార్టీ సహకారం సంపూర్ణంగా ఉంటుందని తెలిపారు. రెండోసారి స్పీకర్ గా ఎన్నికవ్వడం అరుదుగా దక్కే గౌరవం అని, ఇప్పటివరకు ఐదుగురికి అవకాశం దక్కితే అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి నీలం సంజీవరెడ్డి, బాలయోగి ఉన్నారని పేర్కొన్నారు. స్పీకర్ గా ఓం బిర్లా గారి సమక్షంలో ఎన్నో అద్భుత సంఘటన జరిగాయని, కొత్త బిల్లులు ప్రవేశపెట్టబడ్డాయని.. కొత్త పార్లమెంట్ లోకి మారటం, 317, త్రిపుల్ తలాక్, ఐపీసీలో మార్పులు వంటివి వచ్చాయని శ్రీకృష్ణదేవరాయులు అన్నారు.



## అధికారులు బాధ్యతగా పనిచేయాలి

### నిర్లక్ష్యాన్ని సహించం : ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

### పారిశుధ్య సిబ్బందితో కలసి అర్ధరాత్రి రోడ్లు ఊడ్చిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నియోజకవర్గ అభి వృద్ధికి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆకస్మిక తనిఖీలు, ఆకస్మిక పర్యటనలు ప్రతి రోజు ఉంటాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట పట్టణంలో గురువారం రాత్రి స్పెషల్ డ్రైవ్ శానిటేషన్ పనులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మునిసిపల్ కమిషనర్ సి.రవి చంద్రా రెడ్డి కలిసి పరిశీలించారు. ఎవరు చూస్తారు ఎవరు పట్టించుకుంటారనే నిర్లక్ష్య ధోరణి ఇకపై ఉద్యోగులు, అధికారులు వీడాలని హెచ్చరించారు. నరసరావుపేట పట్టణంలో అర్ధరాత్రి పర్యటించి శానిటేషన్ సిబ్బందితో కలసి రోడ్లు ఊడ్చారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా నరసరావుపేటని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచాలన్నారు. పగలు వాహనాలు, ట్రాఫిక్ ఇబ్బంది ఉంటుందని, అందుకే రాత్రిపూట క్లీనింగ్ చేపడుతున్నట్లు శానిటేషన్ సిబ్బంది తెలిపారు. పరిసరాల శుభ్రత ద్వారానే పట్టణంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజల ఋణం తీర్చుకోవడంతో పాటు వైసిపి పాలనకు టిడిపి పాలనకు తేడా ఏంటో చూపిస్తామని అన్నారు. మున్సిపల్ అధికారులు పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కపలవాయి విజయ్ కుమార్, వేల్పుల సింహాద్రి యాదవ్, గూడూరు శేఖర్,టిడిపి నాయకులు కార్యకర్తలు, మునిసిపల్ కార్మికులు పాల్గొన్నారు.



## పౌరసరఫరాల గోదామును తనిఖీ చేసిన జెసి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సకాలంలో చౌకధరల దుకాణాలకు నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న పౌరసరఫరాల శాఖ మండల స్థాయి స్టాక్ పాయింట్‌ను జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ ను తనిఖీ చేసి బియ్యం నిల్వలను పరిశీలించారు. త్వరిత గతిన రేషన్ దుకాణాలకు బియ్యం, పంచదార సరఫరా చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వరలక్ష్మిని ఆదేశించారు. ఎగుమతి దిగుమతి ముఠా కార్మికులను పెంచాలని సూచించారు. స్టాక్ పాయింట్ కింద ఎన్ని దుకాణాలు వున్నాయి ఇప్పటి వరకు ఎన్ని రేషన్ షాపులకు సరుకులు సరఫరా చేశారు తదతర వివరాలను అధికారులు జేసీ కి వివరించారు. తూకంలో వ్యత్యాసం లేకుండా నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీఓ వి.మురళీ కష్ణ తహసిల్దార్ సిహెచ్.ఉషా పౌరసరఫరాల శాఖ ఉప తహసీల్దార్ అరుణాదేవి, గోదాము ఇన్చార్జి వి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సిమెంట్ లారీ బోల్తా

### డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

అదుపుతప్పి సిమెంట్ లారీ బోల్తా పడిన ఘటనలో లారీ డ్రైవర్ గాయపడ్డాడు .ఈ సంఘటన సత్తెనపల్లి మండలం వెన్నదేవి సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ మల్లికార్జున రావు స్వల్పంగా గాయపడ్డాడు. మాచర్ల నుంచి సిమెంట్ లోడుతో రేపల్లె వెళ్తున్న లారీ అదుపుతప్పి డివైడర్ ను ఢీకొట్టడంతో లారీ బోల్తా పడింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.







## భూగర్భజలాలను కాపాడుకోవాలి

### కెఎల్‌యులో నీటియాజమాన్య పద్ధతుల గురించి శిక్షణ

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

నీటి యాజమాన్య పద్ధతుల గురించి సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యూనిట్ విశాఖపట్నం అధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్‌లో గ్రౌండ్ వాటర్ మరియు నేషనల్ అక్విఫర్ మ్యాపింగ్ మరియు మేనేజ్‌మెంట్‌పై ఒకరోజు టైర్-త్రీ శిక్షణా కార్యక్రమాన్ని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ లోని జాస్మిన్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కెఎల్ యు ప్లానింగ్ అండ్ అభివృద్ధి డీన్ డాక్టర్ వి.రాజేష్ మాట్లాడుతూ భూగర్భ జలాలు రానున్న కాలంలో ఎంతో అవసరమన్నారు. దేశంలో భూగర్భ జలాల అన్వేషణ, అభివృద్ధి, నియంత్రణ మరియు నిర్వహణ బాధ్యతలను ఆ సంస్థ కు అప్పగించారున్నారు. మేరా యువ భారత్ (మై భారత్)లో భాగంగా, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ ద్వారా విద్యార్థులకు నీటి రంగానికి సంబంధించిన ప్రారంభ పరిచయం కోసం తగిన శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. ప్రకృతిలో భాగమైన భూగర్భ జలాల గురించి తెలుసుకోవడానికి, వాటిని తెలివిగా, జాగ్రత్తగా ఉపయోగించు కోవదానికి వివిధ అభివృద్ధి, పర్యావరణ ఒత్తిళ్ల కారణంగా ప్రస్తుతం భూగర్భ జలాలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు మరియు సవాళ్లను పరిష్కరించడంలో ఎలా ఉండాలో విద్యార్థులకు తెలియచేయడానికి ఈ కార్యక్రమము రూపొందించబడిందన్నారు. ఈ శిక్షణలో భాగముగా భూగర్భ జలాలు, నాణ్యత, సమస్యలు, సవాళ్లు మరియు జాతీయ అక్విఫర్ మ్యాపింగ్ మరియు నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలను గురించి విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. వివిధ విభాగాలకు చెందిన 148 మంది విద్యార్థులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్, దక్షిణ క్షేత్రం ప్రాంతీయ డైరెక్టర్ జి. కృష్ణమూర్తి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టికె.రామ కృష్ణారావు,సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి. పోలరాజు, అసోసియేట్ డీన్ కెజె బ్రహ్మ చారి, ఆఫీసర్ ఇంచార్జి, స్టేట్ యూనిట్ ఆఫీస్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్, విశాఖపట్నం రవికుమార్ గుమ్మా తదితరులు పాల్గొన్నారు.

# మాచర్ల పట్టణాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్

- మహిళల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి
- గత ప్రభుత్వ పాలనలో అవినీతిపై విమర్శలు
- వైసిపి నాయకులకు స్థల కేటాయింపులపై విచారణ చేయాలన్న సీనియర్ కౌన్సిలర్

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో గత 20 ఏళ్లలో డివైడర్లు మినహా చూడదగిన అభివృద్ధి జరగలేదని, ఇకపై రాజకీయాలను, అభివృద్ధిని విడివిడిగా చూద్దామని, ఇందుకోసం మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం చైర్మన్ చినఏసోబు అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హజరై ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా ఎమ్మెల్యే బాధ్యతలు చేపట్టారు. 11.30 గంటలకు సమావేశం ప్రారంభం కాగా సీనియర్ కౌన్సిల్ సభ్యులు మదార్‌సాహెబ్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఎన్నో ఆక్రమాలు, అవినీతి జరిగిందన్నారు. ప్రభుత్వం పేదలకు అందించే ఇళ్ల స్థలాలను పేదలకు ఊరు చివర ప్రాంతాల్లో ఇచ్చారని, కోటీశ్వరులైన వైసిపి నాయకులు, అభిమానులకు మాత్రం పిడబ్ల్యూడి కాలనీలో ఖరీదైన స్థలం అప్పనంగా కట్టబెట్టారని విమర్శించారు. ఒక్కొక్కరికి 3 నుండి 5 సెంట్లు ఇచ్చారని, ఎలా ఇచ్చారో అర్థం కావటం లేదని అన్నారు. పిడబ్ల్యూడి కాలనీ ఇళ్ల స్థలాల పంపిణీపై విచారణ జరిపించాలని, ఆక్రమంగా లబ్ధిపొందిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో ఎమ్మెల్యే చెపట్టే కార్యక్రమాలకు కౌన్సిల్ తరుపున తమ సహకారం అందిస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాచర్ల పట్టణానికి వచ్చే మహిళల ఆత్మగౌరవం కాపాడేందుకు పలు ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణంపై దృష్టి సారించాలని మున్సిపల్ పాలకవర్గానికి సూచించారు. పట్టణంలో నీళ్ల వ్యాపారం కూడా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు కాల్వలో తాగు నీటి పైపులైన్లు ఉండటంతో నీటి కలుషితం వల్ల మాచర్లలోనే డయేరియా కేసులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇక్కడ నుండి రహదారుల నిర్మాణం చేసేటప్పుడు ముందుగా వాటర్ పైపు లైన్లు వేసి, తదనంతరం రహదారులు నిర్మించాలని చెప్పారు. నూతన లేఆవుట్స్‌లో నిబంధనల మేరకు రహదారుల వెడల్పు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇరుకు రహదారులు అభివృద్ధికి అటంకమన్నారు. మున్సిపాలిటీలో విద్యుత్ బకాయిలు రూ.7 కోట్లుకు పెరగటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కరోనా సమయంలో అనేక నిధులు దుర్వినియోగం అయ్యాయని, రహదార్లు వేయకుండానే బిల్లులు తీసుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్స్ కోసం ఎదురుచూడకుండా, మున్సిపాలిటీకి రావాల్సిన పన్నులు వసూలు చేయాలన్నారు. సమావేశంలో కమిషనర్ దేవళ్ల వెంకటదాసు, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు.


ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డిని సత్కరిస్తున్న కౌన్సిలర్లు



జెసిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

## పాలనలో వ్యత్యాసాన్ని చూపుదాం

### పల్నాడు జెసితో ఎమ్మెల్యే అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, సంక్షేమ పథకాలు సహా ప్రజలకు పార్టీలకతీతంగా అమలు చేయడంలో రాజీ పడకుండా పని చేయాలని పల్నాడు జిల్లా జెసి శ్యామ్‌ప్రసాద్‌కు నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చెప్పారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో జెసిని కలిసి సత్కరించారు. గత పాలనకు, ప్రస్తుత పాలనకు వ్యత్యాసం చూపించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. సమస్యల పరిష్కారంలోనూ వినూత్న కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధికి చిరునామాగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ పరంగా కావాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు.


నాయకులను సత్కరిస్తున్న సభ్యులు

## ఏపీఎన్జీవోస్ కార్యవర్గం సమావేశం

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఎపిఎన్‌జిఒ పెదకూరపాడు తాలూకా కార్యవర్గ సమావేశం అధ్యక్షులు విజయకుమార్ అధ్యక్షతన స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులను సత్కరించారు. తాలూకా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సహాధ్యక్షులు డి.వెంకట్రావు, ఉపాధ్యక్షులు ఎవి.సుబ్బారావు, మధుబాబు, వెంకట్రావు, సహాయ కార్యదర్శి నరసింహారావు, యుగంధర్, నిఖిల్, దిలీప్ కుమార్, మహిళ సంయుక్త కార్యదర్శి ఎన్.సుశీల, కోశాధికారి ఏడుకొండలు పాల్గొన్నారు.

## ఈపూరు దేవస్థాన భూములకు నేడు కౌలు వేలం

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరులోని శ్రీ వీరేశ్వర స్వామి దేవస్థానం సర్వ హక్కు భుక్తము కలిగిన భూములకు దేవదాయ చట్టం 30/87 ప్రకారం శుక్రవారం ఉదయం 10 గంటలకు గ్రామంలోని శ్రీ వీరేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో కౌలు వేలం నిర్వహిస్తామని కార్యనిర్వహణ అధికారి బండి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. మూడేళ్లకు (2024-27) కౌలు హక్కు పొందుటకు దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం ఉంటుందని, గ్రామంలోని సర్వేనంబర్ 81 లో 13.29 ఎకరాలు సాగుకు సంబంధించి సాగు విస్తీర్ణాన్ని బట్టి వేలంలో పాల్గొనే వారు దేవస్థానం షరతులకు లోబడి నిర్ణయించిన డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.


ఎంఇఒ నాగయ్య దంపతులను సత్కరిస్తున్న ఎంపిడిఒ, ఇతర ఉద్యోగులు

## సంతృప్తికరంగా ఉద్యోగజీవితం : ఎంఇఒ నాగయ్య


ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల విద్యావనరుల శాఖాధికారి వేముల నాగయ్య ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేస్తుండగా గురువారం సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపిడిఒ సరోజనిదేవి అధ్యక్షత వహించారు. వేముల నాగయ్య దంపతులను ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, పంచాయితీ సెక్రటరీలు, పలువురు ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా, విద్యాశాఖాధికారిగా తాను చేసిన విధి నిర్వహణ పట్ల ఎంతో సంతృప్తి ఉందన్నారు. ఈ ప్రాంతంలోనే చదువుకుని, ఎక్కువ కాలం ఈ ప్రాంతంలోనే పని చేయటం, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు విద్యాబోధన చేయటం తన అదృష్టంగానే భావించినట్లు చెప్పారు. 39 ఏళ్ల ఉద్యోగ జీవితంలో 20 ఏళ్లు ఎంఇఒగా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. ఎంపిడిఒ సరోజినిదేవి, ప్రత్యేకాధికారి గబ్రూనాయక్‌లు మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన అధికారి నాగయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కోటేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీలు, ఉపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక నాయకులు కేళం ఆదినారాయణ పాల్గొన్నారు.

## నీటి ప్రాజెక్టుల పూర్తికి కృషి : ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - దుర్గి

పల్నాడు ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను చంద్రబాబు హయాంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద రైతులకు రాయితీలపై కంది విత్తనాలను గురువారం పంపిణీ చేయగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రైతులకు రాయితీపై ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, పనిముట్లను సకాలంలో అందించాలని, ఇందుకు అవసరమైన వాటిపై ముందుగానే ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాలని చెప్పారు. కౌల్దార్లంతా గుర్తింపు కార్డులు పొందాలన్నారు. తానూ రైతు కుటుంబం నుంచి వచ్చానని, రైతుల కష్టనష్టాలు తనకు తెలుసుని చెప్పారు. పల్నాడు రైతుల సమస్యలను సిఎం, వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కటకం రామారావు, ఎంపిడిఒ గుప్తా, వ్యవసాయ అధికారులు అమీర్‌రెడ్డి, ఇ.జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ ఫణీంద్ర, ఎంపీపీవీ సునీత, సాయిశంకర్ కూటమి పార్టీల నాయకులు డి.జానకి, రమణ వి.శ్రీనివాసరావు, టి.శ్రీను పాల్గొన్నారు.



## సిసిఆర్‌సి కార్డులపై అవగాహన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే గుర్తింపు కార్డులైన సిసిఆర్‌సి కార్డులు తప్పనిసరిగా పొందాలని మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని జూలకల్లు రైతు భరోసా కేంద్రంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ సిసిఆర్‌సి కార్డుల ప్రయోజనాలను వివరించారు. కార్డులు పొందితే రాయితీ విత్తనాలు, పంట నష్టపరిహారాలు, పంటల బీమా, మద్దతు ధరకు పంటను అమ్ముకునే వీలుంటుందని చెప్పారు. బ్యాంకులు పంట రుణాలూ ఇస్తాయన్నారు. దరఖాస్తులపై భూ యజమానులు సంతకం చేయడం వల్ల వారి భూ హక్కులకు ఇబ్బందేమీ రాదని, అపోహలను వీడి కౌల్దార్లకు సహకరించాలని సూచించారు. పొలం కౌలుకు సాగుచేసే వారంతా పొలం పాస్ బుక్స్ జిరాక్స్, కౌలు రైతు ఆధార్ కార్డు, ఫోన్ నంబరు, పాస్‌ఫోర్టు ఫొటోతో విఆర్‌ఒను సంప్రదించాలని, దరఖాస్తు చేసిన ఒకటి రెండ్రోజుల్లో కార్డులు మంజూరు చేస్తామని వివరించారు.

## కన్నా లక్ష్మీనారాయణకు పలువురు పరామర్శ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో ఇటీవల చేతి గూడుకు సర్జరీ చేయించుకున్న సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. ఆస్పత్రికి వెళ్లి కన్నా లక్ష్మీనారాయణతో మాట్లాడి యోగక్షేమాలు అడిగి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జనసేన సత్తెనపల్లి నియోజకవర్గ నాయకులు బొర్రా వెంకట అప్పారావు, ఇతర టిడిపి ముఖ్యనాయకులూ కన్నా లక్ష్మీనారాయణను పరామర్శించారు.


పరామర్శిస్తున్న జనసేన సత్తెనపల్లి నాయకులు అప్పారావు





# సీడ్‌యాక్సెస్ రోడ్డు భూముల రైతులతో డిప్యూటీ కలెక్టర్ సమావేశం

ప్రజాశక్తి-తాడేపల్లి

సిఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్ ఎం.విశ్వేశ్వరనాయుడు గురువారం పెనుమాకలోని రైతులతో సమావేశం నిర్వహించారు. సీడ్ యాక్సిస్ రోడ్డులో భూములు కోల్పోయే రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. యధావిధిగా రాజధాని నిర్మాణానికి తమ భూములు ఇచ్చేది లేదని ఉండవల్లికి చెందిన డాక్టర్ కన్నారావునాయుడు అధికారుల ముందు తన వాదన వినిపించారు. సీడ్ యాక్సిస్ రోడ్డు అవసరంలేదని, ట్రాఫిక్ మొత్తం తీసుకొచ్చిన తమ నెత్తిన పెట్టడం భావ్యం కాదని చెప్పారు. కళ్లం గోవిందరెడ్డి మరికొందరు రైతులు మాట్లాడుతూ సారవంతమైన పెనుమాక, ఉండవల్లి భూములకు గతంలో జరీబ్ భూమికి 1450 గజాలు, మెట్ట భూమికి 1250 గజాలు తమకు సమ్మతం కాదని అధికారులకు విన్నవించారు. కనీసం 2400 గజాలు ఎకరానికి ఇవ్వాలని కోరారు. పెనుమాక, ఉండవల్లి గ్రామాల్లో అందరూ చిన్న, సన్నకారు రైతులేనని అరెకరం, ఎకరం భూమి ఉన్న రైతు కుటుంబాలు మొత్తం ఆ భూమి తప్ప మరో ఆధారం లేదని చెప్పారు. పిల్లల చదువులు, పెద్దల అనారోగ్య కారణాలు వీటన్నటి రీత్యా తమకు న్యాయబద్ధంగా ఎకరానికి 2400 గజాలు భూమి ఇవ్వాలని కోరారు. కృష్ణాయపాలెం, వెంకటపాలెం, తుళ్లూరు మండలాల్లోని కొన్ని గ్రామాలు రైతులు ఎక్కువ భూమి కలిగి ఉన్న రైతులని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారితో పాటు తమకు గతంలో టిడిపి ప్రభుత్వం ప్రకటించిన 1450 గజాలు, 1250 గజాలు ఇచ్చి వారితో సరిపోల్చడం సరికాదన్నారు. రాజధాని నిర్మాణానికి తామేమీ వ్యతిరేకం కాదని, అభివృద్ధికి సహకరిస్తామని హామీనిచ్చారు. తుళ్లూరు మండలం నేలపాడు గ్రామంలో భూమి రూ.3 లక్షలు విలువ ఉంటే పెనుమాక గ్రామంలో రూ.8 లక్షలు ఉందని చెప్పారు. ఆ దామాషా ప్రకారం చూసినా తమకు ఎక్కువ గజాలు ఇవ్వడం సమంజసమేనని చెప్పారు. దీనిపై విశ్వేశ్వరనాయుడు స్పందిస్తూ రైతులు పట్టుదలకు పోకుండా సామరస్యంగా ఈ సమస్యను పరిష్కరించుకోవాలని, రైతులందరూ ఏకతాటిపై ఒక అంగీకారానికి రావాలని కోరారు. ఈ సమావేశంలో రైతులు కె.ఈశ్వరరెడ్డి, గంగిరెడ్డి నాగరాజు, తాడిబోయిన శ్రీనివాస్, టిడిపి నాయకులు కొల్లి శేషు తదితరులు పాల్గొన్నారు.

### నాడు ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు

ఐదేళ్ల క్రితం టిడిపి ప్రభుత్వం పోయి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మంగళగిరి ఎమ్మెల్యేగా ఆళ్ల రామకృష్ణారెడ్డి రెండో సారి ఎన్నికయ్యారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెనుమాక, ఉండవల్లి గ్రామాలను సిఆర్‌డిఎ నుంచి తొలగిస్తామని అప్పట్లో ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఐదేళ్లు గడిచాయి. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదు. ఇటీవల ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పెనుమాక, ఉండవల్లి రైతుల సమస్య ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు ఉంది. ఇప్పటికైనా ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందా అని రైతులు ఎదురుచూస్తున్నారు.

## కాచి చల్లార్చిన నీటిని తాగాలి

**జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి**

ప్రజాశక్తి- గుంటూరు

డయేరియానివారణకు ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో కోరారు సాధారణంగా డయేరియా త్రాగే నీరు ఆహార పదార్ధాలు కలుషితం అవడం వల్ల వస్తుందని, కావున ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీళ్లు త్రాగడం, వేడి వేడి ఆహార పదార్థాలు భుజించడం భోజనానికి ముందు తరువాత సబ్బుతో చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడం, వండిన ఆహార పదార్ధాలపై మూతలు పెట్టడం, నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తినరాదని, మాంసాహారం, చేపలకు దూరంగా ఉండాలని సూచించారు.అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యర్థ పదార్థాలను మూత ఉన్న డస్ట్ బిన్ లో భద్రపరిచి, ఊరికి దూరంగా డిస్పోస్ చేయాలని, ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినరాదని, చిన్నపిల్లలు బయటి చిరుతండ్లు తినకుండా చూసుకోవాలని, మలవిసర్జనకు బహిర్భూమికి వెళ్ళకుండా, వ్యక్తిగత మరుగుదొడ్లను మాత్రమే ఉపయోగించాలని తెలియజేసినారు. డయేరియా బారిన పడినవారు, దగ్గరలోని ఆశ కార్యకర్తలని ఆరోగ్య కార్యకర్తలని, ఎం ఎల్ హెచ్ పి లని సంప్రదించాలని, ఇంటి వద్ద లభించే ద్రవరూప పదార్థాలైన మజ్జిగ, గంజి, పప్పు మీద తేట, కొబ్బరి బోండా నీళ్లు తీసుకుంటే నీరసం రాకుండా ఉంటుందని, పరిస్థితి తీవ్రతను బట్టి దగ్గరలోని, పట్టణ లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని, పైపులైను నీరు రంగు మారిన, దుర్వాసనతో ఉన్న, పంచాయతీ లేదా మున్సిపాలిటీ అధికారులకు తెలియజేయాలని, నీళ్ల విరోచనాల్ని అశ్రద్ధ చేయకుండా, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

## డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్‌కు విశేష స్పందన

### నిర్మల కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి




మాట్లాడుతున్న నిర్మల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి వి ప్రసాద్

నవజీవన్ బాల భవన్ ఆద్వర్యంలో మంగళగిరి లోని నిర్మలా జూనియర్ కళాశాల, విజేపీ అండ్ డి ఎల్ బి డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచార వారోత్సవాలలో భాగంగా గురువారం వినూత్నంగా 'డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో' సెల్ఫీ కాంటెస్ట్ విద్యార్థులతో నిర్వహించటం జరిగింది. విద్యార్థులు అందరు నేను డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో అని ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో నిర్మలా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.వి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుండే అవగాహన కలిగి ఉండాలని, ప్రతిఒక్కరు విలువలతో ఉండాలని అన్నారు. కుటుంబ విలువలు, శారీరక, మానసిక ఆరోగ్యాల ప్రాధాన్యతను దష్టిలో ఉంచుకొని అడుగులు వేస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయి అని అన్నారు. మాధకద్రవ్యాల వలన జీవితాన్ని ఎంతగా ప్రభావితం చేస్తాయో, ఎటువంటి పతనావస్థకి చేరుస్తాయో ముందుగానే తెలుసుకొని సక్రమమైన మార్గంలో జీవించాలని అన్నారు. నవజీవన్ బాల భవన్ జిల్లా కోఆర్డినేటర్ బి రమేష్, వి జె పి అండ్ డి ఎల్ బి డిగ్రీ కళాశాల డైరెక్టర్ , ప్రిన్సిపాల్ డి శ్రీనివాసరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంతో ఉన్నతమైన భవిష్యత్తును ఆశించే విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు లాంటి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వినియోగం ప్రాణాంతకమన్నారు. కార్యక్రమములో నవజీవన్ బాల భవన్ నిర్మల జూనియర్ కళాశాల అధ్యాపకులు ఏ ప్రసాద్, విజెపి అండ్ డి ఎల్ బి డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ ఎస ప్రోగ్రాం ఆఫీసర్ రవీంద్రనాథ్, నవజీవన్ జోనల్ కోఆర్డినేటర్ డి విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చదువుతోపాటు, ఆటలు, నైపుణ్య శిక్షణ అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే యండి.నసీర్ అహ్మద్ అన్నారు.ముఖ్యంగా క్రీడలపై దృష్టిపెట్టి విద్యార్థులను తీర్చిదాలని కోరారు. స్థానిక హిందూ కాలేజిలోని ఏడీ హాల్లో నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు ధీటుగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఆట స్థలాలు, లైబ్రరీ, ల్యాబ్స్‌లు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా ఉన్నత శిఖరాలకు బాటలు వేసుకోవాలన్నారు. తమ ప్రభుత్వం ఒక ఇంట్లో ఇద్దరు, ముగ్గురు విద్యార్థులున్నా వారందరికీ తల్లికి వందనం అందచేస్తామన్నారు. ఉప విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్టూడెంట్ కిట్స్‌ను వినియోగించుకొని బాగా చదవాలని సూచించారు. ఎంఇఒ వి.వెంకటేశ్వరరావు ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంఇఒ నాగేంద్రమ్మ, కార్పొరేటర్లు పి.సమత, చిష్టీ, ఉర్దూ డిఐ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్స్ అందచేస్తున్న ఎమ్మెల్యే తదితరులు



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

## మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి -పొన్నూరు

మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్‌చేశారు. గురువారం పొన్నూరులోమున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక సీఐటీయూ ఆఫీస్ లో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు గుంటూరు జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గుంటూరు జిల్లా కార్యదర్శి ముత్యాలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణలో భాగంగా సంక్రాంతి కానుక రూ.వెయ్యి ఇస్తామని అప్పటి ప్రభుత్వం తెలిపారు. ఇంతవకు ఇవ్వలేదన్నారు. 2023 నవంబరు డిసెంబర్ హెల్త్ అవేలెన్సులు బకాయిలు, కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు, రక్షణ పరికరాలు పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక సమస్యలు పరిష్కారానికై మున్సిపల్ కమిషనర్ కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సిఐటియు మండల కార్యదర్శి నిమ్మకూరు రమేష్ బాబు, అధ్యక్షులు భూషమ్మ, కార్యదర్శి మంగమ్మ కార్మికులు పాల్గొన్నారు




సమావేశంలో మాట్లాడుతున్న దండా లక్ష్మీనారయణ

## సంక్షేమ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - పొన్నూరు

భవననిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పొన్నూరు లోని సిఐటియు కార్యాలయంలో మిక్కిలి దుర్గయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేవని, ఇసుక అందుబాటులోకి తేవాలని కోరారు. ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాజధాని నిర్మాణ పనుల్లో స్థానిక భవన నిర్మాణ కార్మికులకి అవకాశం ఇవ్వాలనీ కోరారు. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొన్న సమస్యలపై జూలై ఒకటో తారీకున జరిగే మండల సదస్సులో భవనిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎన్ రమేష్ బాబు, భవన నిర్మాణ కార్మికులు షేక్. బాజీ, కార్పెంటర్ షేక్ అబ్దుల్ గఫార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడండి

ప్రజాశక్తి-గురజాల

మండలంలోని అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండల స్థాయి అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని బాపూజీ సేవా సంఘం సభ్యులు పెనుగొండ అమృత లింగేశ్వరరావు, డి.రాధాకృష్ణమూర్తి కోరారు. మండలంలోని పల్లెగుంత, మాడుగుల, గొట్టిముక్కల, గంగవరం, తదితర గ్రామాల్లో ప్రజలు వాంతులు, విరోచనాల బారినపడ్డారని, అధికారులు సత్వరం స్పందించాలని కోరారు. మురుగు కాల్వలను శుభ్రం చేయించడంతోపాటు బ్లీచింగ్ చల్లించాలని, దోమల నివారణ చేపట్టాలని విన్నవించారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించి నీటిని క్లోరినేషన్ చేయించాలన్నారు.



## డీఎస్సీ ప్రకటనపై హర్షం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రతి సంవత్సరము టెట్ నిర్వహిస్తామని, త్వరలోనే మెగా డీఎస్సీని ప్రకటిస్తామని మొదటి సంతకం చేసిన సిఎం చంద్రబాబు నాయుడుకు రాష్ట్రంలోని ప్రైవేటు ఉపాధ్యాయుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని టిడిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహ కార్యదర్శి బత్తినేని శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచింగ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నకేశవ రాంబాబు అన్నారు. పట్టణంలోని రాష్ట్ర ప్రైవేటు టీచింగ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం వారు విలేకర్లతో మాట్లాడారు. నిరుద్యోగులు కష్టపడి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సత్యం, దేవిరెడ్డి లక్ష్మీనారాయణ, సాకిరి నాగార్జున, కునపరెడ్డి సతీష్, బైరా వాసు, కటారి వెంకటేశ్వర్లు, హనుమంతరావు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా ప్రసాదు


ప్రజాశక్తి - పెదకూరపాడు



యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెదకూరపాడు బ్రాంచ్ మేనేజర్‌గా ఎ.ప్రసాదు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన శ్రీకాంత్ సత్తెనపల్లి మండలం రెంటపాళ్లకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. వ్యవసాయ, వాణిజ్య రుణాలు ఇస్తామని చెప్పారు.

## ప్రముఖ వైద్యులు కొల్లా రామారావు మృతి

ప్రజాశక్తి - చిలకలూరిపేట


డాక్టర్ కొల్లా రామారావు (ఫైల్)

వైద్య రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కొల్లా రామారావు (73) స్థానిక సిఆర్ కాలనీలోని తన నివాసంలో గురువారం సాయంత్రం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు, అతని భార్య కూడా వైద్యులుగా రామారావు ఆస్పత్రిలోనే పని చేస్తున్నారు. రామారావు మృతిపై పలువురు డాక్టర్లు, ఆర్య వైశ్య ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు శుక్రవారం నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు.

# వినుకొండ డిపోను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- బస్సుల పెంపు, సదుపాయాల కోసం ప్రభుత్వానికి నివేదిస్తాం
- ప్రయాణికులు, కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి
- బస్సుల్లేని తండాలకు సర్వీసులు నడపాలి : ఎమ్మెల్యే జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతోపాటు మోడల్ డిపోగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. గురువారం ఉదయం ఆయన ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించారు. డిపో ఆవరణలో మూత్ర విసర్జన, మరుగుదొడ్ల వద్ద దుర్గంధం వెదలడం, డ్రెయినేజీలో మురుగునీరు నిలిచిపోవడం, ప్రయాణికుల మూత్ర విసర్జనకు సరైన సౌకర్యం లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. క్షీణించిన పారిశుధ్యాన్ని సత్వరమే మెరుగుపరచాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డిపో ప్లాట్‌ఫామ్ దెబ్బ తినడం, ఆర్టీసీ కార్యాలయానికి బీటలువారటం, బస్సులు నిలుపు ప్రదేశంలో నెర్రెలు కొట్టి గుంతలు పడడం గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. బస్సులు ఎక్కి ప్రయాణికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డిపో ఆవరణలో కనీసం


బస్సులో ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

తాగునీరు కూడా లేదని ప్రయాణికులు చెప్పారు. డిపోకు నూతన బస్సుల కేటాయింపునకు కృషి చేస్తానని, డిపో అభివృద్ధికి నిధుల కేటాయింపు కోసం ప్రభుత్వాన్ని కోరతామని ఎమ్మెల్యే అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, గ్యారేజీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. బొల్లాపల్లి మండలంలో బస్సు సౌకర్యం లేని గిరిజన తండాలకు వెంటనే బస్సు సర్వీసులు నడపాలని అధికారులను ఆదేశించారు. డిపో అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం అంచనాలు తయారు చేయాలని ఆర్టీసీ ఇంజనీరింగ్ శాఖ విభాగానికి సూచించారు. అనంతరం గ్యారేజీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసరావు, డిఎం కోటేశ్వరరావు నాయక్, ఆర్టీసీ ఉద్యోగులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.


పరీక్షల నిమిత్తం నీటి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

## మంచికల్లులో జిల్లా వైద్యాధికారి పరిశీలన

ప్రజాశక్తి - రెంటచింతల

గ్రామాలు ఆరోగ్యకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని పల్నాడు జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి ఆదేశించారు. గురువారం మండలంలోని మంచికల్లులో ఆయన పర్యటించి ఆర్డబ్ల్యూఎస్, వైద్యారోగ్య సిబ్బంది, ఎన్ఎంలు, సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇంటింటికీ తిరిగి వ్యాధులను గుర్తించి వైద్య సేవలు అందించాలని చెప్పారు. 10 నీటి శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలకు పంపించారు. పరిశీలనలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కృష్ణారెడ్డి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరేంద్రరెడ్డి ఉన్నారు.

## రొంపిచర్ల వాసి నాగరాజుకు అమెరికా వర్సిటీ డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సేవా కార్యక్రమాలు చేస్తూ వాటిని విస్తరించేందుకు మా చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో పేదలకు, యాచకులకు రాత్రి వేళ ఆహారం అందించి ఆకలి తీరుస్తున్న స్వర్ణ నాగరాజు సేవలను గుర్తించిన అమెరికాకు చెందిన హోలీ స్పిరిట్ క్రిస్టియన్ అసోసియేషన్ (హెచ్ఎస్‌సి) యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. గురువారం సికింద్రాబాద్‌లో యూనివర్సిటీకి చెందిన శాఖ భవనంలో స్వర్ణ నాగరాజును యూనివర్సిటీ డైరెక్టర్ బిషప్ డాక్టర్ ఆనంద్ కుమార్ సత్కరించి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. యువకులు స్వర్ణ నాగరాజును స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జర్నలిస్టు వృత్తిలో భాగంగా రాత్రి సమయంలో బయట తిరిగే క్రమంలో యాచకులు, ఏ ఆధారం లేని వృద్ధులు పడుతున్న అవస్థలు చూసి ఆవేదనకు గురయ్యానని, రాత్రి సమయంలో ఆహారం దొరకక నీటితో కడుపు నింపుకుంటున్న దయనీయ పరిస్థితి కలిచి వేసిందని అన్నారు. కొద్దిపాటి ఆదాయం మొత్తాన్ని యాచకుల ఆకలి తీర్చేందుకు వెచ్చిస్తున్నానని గమనించిన మిత్రులు స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం చేయడంతో పాటు సేవా కార్యక్రమాలను సోషల్ మీడియాలో ప్రచారం చేశారని అన్నారు. డాక్టరేట్ దక్కడం సేవా కార్యక్రమాల పట్ల బాధ్యతను మరింత పెంచిందన్నారు.


ధ్రువపత్రాలు ఇస్తున్న అధికారులు

## కౌల్దార్లంతా సిసిఆర్‌సి కార్డులు పొందాలి

ప్రజాశక్తి - నాదెండ్ల

రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు దృష్టి మళ్లించాలని పల్నాడు జిల్లా డిడిఎ ఎం.శివకుమారి సూచించారు. మండలంలోని గణపవరంలో కౌలురైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిడిఎ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకోవాలని, వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని చెప్పారు. పచ్చిరొట్ట పంటలు వేసుకుంటే భూమి సారవంతమవుతుందని చెప్పారు. పశువుల ఎరువు లేదా పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర వంటివాటిని సాగు చేస్తే రసాయనిక ఎరువులు వాడకం తగ్గించవచ్చని వివరించారు. పత్తి, మిర్చి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. ఎడిఎ మస్తానమ్మ మాట్లాడుతూ కౌలు రైతులందరూ సిసిఆర్‌సి కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్డులు పొందటం ద్వారా ఈ-క్రాప్‌లో పంట నమోదుతోపాటు ప్రకృతి వైపరీత్యాలు సంబవిస్తే ఉచితంగా పంటల బీమా వర్తిస్తుందని, పంటను మద్దతు ధరకు అమ్ముకోవచ్చని చెప్పారు. వ్యవసాయంలో అందించి రాయితీలు దక్కుతాయని, ఇతర పథకాలూ వర్తిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎ.హరిప్రసాద్, వార్డు కౌన్సిలర్ సుధాకర్, వీఆర్వోలు వెంకటరమణ, సాంబశివరావు, అంకమ్మరావు, వీరయ్య, నాయకులు జీవన్, లక్ష్మణ్, అశోక్‌రెడ్డి, వెంకటేష్, రైతులు, కౌలురైతులు పాల్గొన్నారు.

## పని చేసి మూడు వారాలైనా..

### కూలి డబ్బుల కోసం ఉపాధి హామీ కూలీల వేడుకోలు

**ప్రజాశక్తి - రెంటచింతల :** ఉపాధి హామీ పనులు చేసి మూడు వారాలు గడిచినా తమకు కూలి డబ్బులింకా రాలేదని కూలీలు వాపోతున్నారు. నిత్యవసర వస్తువులు ధరలు పెరిగిపోయిన నేపథ్యంలో ఆర్థిక అవసరాలు పెరిగాయని, మరోవైపు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఒక్కొక్క కూలికి రూ.3 వేలకుపైగా రావాల్సి ఉందని, వాటిని ఇస్తే ఇల్లు గడవడానికి ఉపయోగ పడుతుందని అంటున్నారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు సత్వరమే స్పందించి డబ్బులు విడుదల చేయించాలని కోరుతున్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించండి

**వేజెండ్లలో విద్యార్థులతో 'నేను బడికి పోతా' ర్యాలీ**

**ప్రజాశక్తి - చేబ్రోలు**

ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లలను చేర్పించండని విద్యాశాఖాధికారులు తెలిపారు. గురువారం విద్యాశాఖ ఆధ్వర్యములో వేజెండ్ల గ్రామపరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాధమిక పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులచే నేనుబడికిపోతా ర్యాలీ నిర్వహించి, ర్యాలీ అనంతరం 5 గురు బడిబయట పిల్లలను పాటశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒ 1, 2 ఎవి హెచ్ ప్రసాద్, ఆర్ సుబ్బారావు మాట్లాడారు. ప్రజలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల అధిక ఫీజుల భారంతో ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వ పాఠశాలను వినియోగించుకోవాలని కోరారు. మండలంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు జూలై 25 వరకు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా పిల్లల నమోదు శాతాన్ని పెంచడం జరుగుతుందని అన్నారు. బడి బయట పిల్లలు, బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేయొచ్చేందుకు మండల,గ్రామ స్థాయి, కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవము అర్హత కలిగిన ఉపాధ్యాయులకు బోధన, ప్రైవేటు కార్పొరేషన్ పాఠశాలకు తగిన మౌలిక వసతులుఉన్నాయని అన్నారు. ముఖ్యముగా 6 నుండి 14 సంవత్సరాల వయసుగల బడిబయట వున్న పిల్లలను పాఠశాలలో చేర్పించుటకై ఈ కార్యక్రమము ప్రత్యేకముగా నిర్దేశించబడినదని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయ సి అర్ పి సంపూర్ణమ్మ, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, జి వి అర్ విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు ఈసా వర్మ మూర్తి, మాధురి దీప్తి,రిజ్వానా అంగన్వాడీ ఉపాధ్యాయులు వెల్ఫేర్ అసిస్టెంట్స్ త్రివేణి సంతోష్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాలను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

అనుమతి లేకుండా విత్తనాలు అమ్మిన అధిక ధరలకు అమ్మిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి పి శిరీష అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో గురువారం ఆమె విత్తనాలు అమ్మే దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్ద కొండూరు గ్రామంలోని విత్తనాలు అమ్మే షాపులో రెండు కంపెనీలకు చెందిన వరి విత్తనాలను శాంపిల్స్ తీశారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకు మాత్రమే అమ్మాలని కోరారు. ఈ సందర్భంగా షాపుల లైసెన్సు వ్యాలిడిటీ విత్తన నిల్వలు సోర్స్ సర్టిఫికెట్ స్టాక్ రిజిస్టర్ బిల్లు పుస్తకాలు తదితర రికార్డులను పరిశీలించారు. గురువారం నుండి రైతు భరోసా కేంద్రాలలో ఏపీ సీడ్స్ వారి ద్వారా సరఫరా చేసిన వరి విత్తనాలు విక్రయిస్తున్నారని ఆమె తెలిపారు. మండలానికి 253 క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని ఇండెంట్ పెట్టినట్లు ఆమె తెలిపారు. సకాలంలో రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలు వచ్చాయని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆధార్ కార్డు పాస్ పుస్తకం జిరాక్స్ ద్వారా రైతు భరోసా కేంద్రాల నుండి రైతులు తీసుకోవచ్చునన్నారు.



## రోడ్లపైకి ఆవులను వదిలితే యజమానులపై చర్యలు : కమిషనర్

**ప్రజాశక్తి - మంగళగిరి**

రోడ్లపైకి ఆవులను వదులుతూ ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ వి నిర్మల్ కుమార్ హెచ్చరించారు. గురువారం నిర్మల్ కుమార్ కార్పొరేషన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లపై ఆవులు సంచారం అధికంగా ఉండటం వలన వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతోపాటు పాటు ట్రాఫిక్ కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే ఆవుల యజమానులతో సమావేశం నిర్వహించి 24 గంటల్లో ఆవులను ఆయా ఆవరణలో గృహాలలో ఉంచుకోవలసినదిగా ఆవుల యజమానులకు నోటీసులు అందజేశామని తెలిపారు. నేటి నుండి వీధుల్లో ఆవులు కనిపించినట్లయితే ప్రజారోగ్య దృష్ట్యా వాటిని గోశాలకు తరలిస్తామని నిర్మల్ కుమార్ ఆవుల యజమానులను హెచ్చరించారు.



మీడియాతో మాట్లాడుతున్న కమిషనర్

# పెన్షన్ పంపిణీ సక్రమంగా నిర్వహించాలి

**ప్రజాశక్తి - మంగళగిరి**

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో వచ్చే నెల 1 తేదీన సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకం అమలుపై గురువారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమీషనర్ వి నిర్మల్ కుమార్ నగరపాలక సంస్థ పరిధి లోని అన్ని సచివాలయముల అడ్మిన్ల, సెక్రటరీ ల తో , వార్డ్ వెల్ఫేర్ సెక్రెటరీ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పింఛన్లు సజావుగా జరిగేలా అందరూ కషి చేయాలని కోరారు. ఉదయం 6 గంటల నుండి తప్పనిసరిగా పెన్షనర్ల ఇంటి వద్దకే గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా నోడల్ ఆఫీసర్లని నియమిస్తామని తెలిపారు. ఒక్కొక్క ఉద్యోగి 50 గహాల చొప్పున కేటాయించటం జరిగిందని అదనంగా ఉద్యోగులు అవసరం అయితే ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే వినియోగించాలని ఆయన ఆదేశించారు. ప్రతి సచివాలయ ఉద్యోగి ప్రణాళిక ప్రకారము ఏ ఒక్క లబ్ధిదారుడు నష్టపోకుండా వారికి ముందస్తు సమాచారం అందచేసి ఎటువంటి అవకతవకలు లేకుండా పంపిణీ కార్యక్రమం విజయవంతం పూర్తి చేయాలని ఏవైనా సమస్యలు ఎదురైనట్లతే వెంటనే పై అధికారుల దష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. ఈ సమావేశం లో డిప్యూటీ కమిషనర్ బి శివారెడ్డి, సూపరిండెంట్ లు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

## కొలకలూరులో రైతు సదస్సు

**ప్రజాశక్తి-తెనాలిరూరల్**

ఖరీఫ్ సీజన్లో వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని కొలకలూరు సర్పంచ్ చొప్పర ప్రీతి అశోక్ కుమార్ అన్నారు. గురువారం కొలకలూరు రైతు భరోసా కేంద్రంలో జరిగిన రైతు సదస్సులో పాల్గొని సలహాలు, సూచనలు చేశారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి ప్రేమ సాగర్ మాట్లాడుతూ విత్తనాలను విత్తే సమయంలో రైతులు ముందుగా విత్తినచోట మొలక శాతాన్ని కట్టాలన్నారు. విత్తే సమయంలో 100 కు 80 కి పైగా విత్తనాలు మొలకెత్తితే అవి నాణ్యమైన విత్తనాలుగా పరిగణించాలని రైతులకు సూచించారు. భూసార పరీక్షల కోసం ఆర్బికె ద్వారా మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆర్బికె కేంద్రాలు ద్వారా మాత్రమే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విత్తనాలను విక్రయించాలని డీలర్లకు సూచించారు. అనంతరం కొనుగోలు దారులకు సక్రమమైన రసీదు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన డీలర్లపై శాఖ పర్యమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు లోబడి వ్యాపారాలు కొనసాగించాలని గ్రామీణ ప్రాంతాల వ్యాపారులకు తెలియజేశారు. కార్యక్రమంలో విఎఎ లు నాగరాజు, నాగేంద్ర, శివతేజ, విఆర్ఒ నితీష్ కుమార్, రైతులు కష్ణమోహన్, నాగేశ్వరరావు, చంద్రశేఖర్, సుబ్బారావు, వెంకటరావు, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎఓ ప్రేమ సాగర్, హాజరైన రైతులు

## దళిత ఉద్యమ శిఖరం బొజ్జా తారకం

**ప్రజాశక్తి-గుంటూరు**

న్యాయ వృత్తిని ఆయుధంగా చేసుకొని దళిత బహుజన హక్కులే మానవ హక్కులు అని ఆంధ్ర రాష్ట్రంతో పాటు అంతర్జాతీయంగా ఎస్సీ, ఎస్టీ సమస్యలను ఎలుగెత్తి చాటిన గొప్ప మేధావి బొజ్జా తారకం అని భీమ్‌భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్ అన్నారు. గురువారం అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో బొజ్జా తారకం 83వ జయంతి సభ సంఘం నాయకులు డి.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాగళ్ళ ప్రకాష్ మాట్లాడుతూ బొజ్జా తారకం హైకోర్టు న్యాయవాదిగా కొనసాగుతూ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ఆంధ్ర రాష్ట్రమంతా వ్యాపింప జేయటానికి కృషి చేశారని, 1985 కారంచేడు దళితులపై మారణ హోమానికి నిరసనగా దళిత మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉద్యమ నిర్మాణంలో తన వంతు పోరాటాన్ని కొనసాగించారని, డాక్టర్ కత్తి పద్మారావుతో పాటుగా కేజీ సత్యమూర్తి, గద్దర్ లాంటి ప్రముఖ ఉద్యమకారులతో పనిచేశారన్నారు. కార్యక్రమంలో బిసి మహాజన సమితి రాష్ట్ర అధ్యక్షులు ఉగ్గం సాంబశివరావు, బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కోఆర్డినేటర్ సాదు మాల్యాద్రి, బీసీ బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు. చార్వాక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిన్నం డేవిడ్ విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.



బొజ్జా తారకం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు



విద్యార్థులకు స్టీలు బాక్సులు పంపిణీలో సంస్థ బృందం

## లయన్స్‌క్లబ్ ఆఫ్ తెనాలి వితరణ

**ప్రజాశక్తి - తెనాలి**

పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో గురువారం పాత సత్యనారాయణ టాకీస్ రోడ్డులోని మున్ని మస్తాన్ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు స్టీల్ బాక్సులు పంపిణి చేశారు. సంస్థ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రహ్మణ్యం పుట్టినరోజు సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా క్లబ్ అధ్యక్షుడు సాతులూరి రాం ప్రసాద్ మాట్లాడుతూ సంస్థ తరపున ప్రతినిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దానిలో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టీల్ బాక్సులు, పలకలు పంపిణి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎన్ కష్ణమోహన్, డాక్టర్ కొత్తపల్లి రాజ్ కుమార్, పి వెంకటేశ్వరరావు, కె రమేష్ కృష్ణ, ఉపాధ్యాయులు షేక్ రబియా, టి వరప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా బంకించంద్ర ఛటర్జీ జయంతి

**ప్రజాశక్తి - మంగళగిరి**

ప్రసిద్ధ రచయిత, భారత స్వాతంత్ర్య సమరయోధులు బంకించంద్ర ఛటర్జీ 187వ జయంతినీ, పురస్కరించుకొని శ్రీ వేంకటేశ్వర యోగ సేవా కేంద్ర వ్యవస్థాపకులు, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వేంకటేశ్వర యోగి గురూజీ బంకించంద్ర ఛటర్జీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం,వివేకానంద విద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా వేంకటేశ్వర యోగి మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య సమర శంఖారావం, వందేమాతర గీతంతో ఆరంభం అయింది అన్నారు. బంకించంద్ర ఛటర్జీ రచించిన ఆనందమఠం అనే నవలలో ఈ గీతం ఉందని, ఆనాడు భారతీయులు వందేమాతర గీతాన్ని ఉద్యమ గీతంగా స్వీకరించారని తెలియజేశారు. కార్యక్రమంలో యోగా కేంద్ర ఉప ప్రధాన ఆచార్యులు మంద్రు శ్రీనివాస కుమార్, కార్యదర్శి ఏ.రత్నకుమారి, శిరందాసు విజయభాస్కం పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ క్యాంపులో తెనాలి విద్యార్థి

**ప్రజాశక్తి-తెనాలి**

స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ బాలురోన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి యడ్ల తరుణ్ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నాడు. పాఠశాల ప్రధానోపా ధ్యాయిని షేక్ మౌలాభి గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం ఈ నెల 15 నుంచి 26 వరకు కేఎల్ యూని వర్సిటీ, వడ్డేశ్వరంలో జరిగిన జాతీయస్థాయి ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ క్యాంప్ లో తరుణ్ పాల్గొన్నాడని, క్యాంపులో మన రాష్ట్ర ఎన్సిసి క్యాడెట్స్ తో పాటు రాజస్థాన్ , జైపూర్ ,ఉదయ పూర్ రాష్ట్రాలకు చెందిన ఎన్సిసి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ క్యాంప్‌ల వలన విద్యార్థుల్లో జాతీయ సమైక్యత , సోదర భావం, వివిధ రాష్ట్ర ఆచార వ్యవహారాలు తెలుసుకునే వీలుంటుందన్నారు. విద్యార్థి తరుణ్ ను అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ప్రధానోపాధ్యాయిని మౌలాభి

## రైల్వే ప్రాజెక్టులకు సహకరించండి

**కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు మంత్రి డాక్టర్ పెమ్మసాని వినతి**

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**



గుంటూరు ప్రజల ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఆర్‌వోబి, ఆర్‌యూబిలను నిర్మాణా నికి అనుమతి ఇవ్వాలని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు. రైల్వే మంత్రిని డాక్టర్ పెమ్మసాని గురువారం మర్యాదపూ ర్వకంగా కలిశారు. రైల్వే పనులు పెండింగ్ పడ టం వల్ల ప్రజానీకం, రైతాంగం తీవ్రంగా సమ స్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ క్రమంలో రైల్వే సంబంధిత పనులను పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తోడ్పాటును అందించాలని ఆయన కోరారు. పెండింగ్ పనులపై అశ్విన్ వైష్ణవ్ వివరణ కోరగా పలు ప్రాజెక్టులను, ఆయా ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న ఇక్కట్లను గురించి పెమ్మసాని వివరించారు. సమస్యలను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలియజేశారు.



## డయేరియా బాధితులకు సత్వరం చికిత్స చేయండి

**జడ్‌పి ఛైరపర్సన్ హెనీ క్రిస్టీనా**

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :**డయేరియా బాధితులకు వైద్య సేవలు సత్వరమే వైద్యసేవలు అందించాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ క్రిస్టియనా కోరారు. గురువారం ఆసుపత్రి లో డయేరియా బాధితులను సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తో కల్సి పరామర్సించారు. ఈ సందర్భంగా క్రిస్టియనా మాట్లాడుతూ బాదితులను ఒక్కొక్కరితో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నానని అన్నారు. ఆసుపత్రి లో సకాలంలో వైద్యులు వైద్యం అందిస్తుండటం వల్ల వారి ఆరోగ్యంగా కుదుట పడుతుందన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలసిందిగా సూపరింటెండెంట్ ను ఆదేశించినట్లు చెప్పారు.

## స్టడీ సర్కిల్స్‌ను పటిష్టపరచాలి

**మంత్రి బాలవీరాంజనేయస్వామికి వినతి పత్రం ఇచ్చిన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు**

**ప్రజాశక్తి-గుంటూరు**

ఆంధ్రప్రదేశ్ నూతన సాంఘిక, సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సచివాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై మెమో రాండ్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బిఆర్ అంబేద్కర్ స్టడీ సర్కి ల్‌ను పటిష్టపరచాలని, స్టడీ సర్కిల్స్ ఐఎఎస్, ఐపిఎస్ మొదలైన సివిల్ సర్వీసెస్ కోచింగ్ ప్రారంభించాలని, గుంటూరులో అసంపూర్తిగా ఉన్న అంబేద్కర్ భవన్‌లో నిర్మాణం పూర్తి చేయాలని, డిఎస్సీ పరీక్షకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ప్రారంభించాలని కోరారు. ఆయా సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని లక్ష్మణరావు తెలిపారు.



మంత్రి బాలవీరాంజనేయస్వామికి వినతిపత్రం ఇస్తున్న కెఎస్ లక్ష్మణరావు

## మధ్యాహ్నభోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి : కలెక్టర్

**ప్రజాశక్తి-గుంటూరు**

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సంపూర్తిగా అమలు అయ్యే విధంగా విద్యాశాఖాధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ ఆదేశించారు. గురువారం కలక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ నాగలక్ష్మి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సంపూర్తిగా అమలు చేయాలని సూచించారు. విద్యాశాఖాధికారులు, మండల విద్యాధికారులు ప్రతిరోజూ స్కూళ్ళను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం అమలును తప్పక పరిశీలించాలన్నారు. మెనూ ప్రకారం రుచి, సుచితో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని తెలిపారు. ఇప్పటికే అందిన విద్యా కిట్ల పంపిణీని విద్యార్థులందరికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫేజ్-2 క్రింద అందుబాటులో వున్న నిధులతో స్కూల్ ఇన్ఫ్రా ఇంప్రూమెంట్ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారిణి శైలజ , సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ విజయలక్ష్మీ , సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జ్యోతి , ఇంజనీరింగ్ విభాగ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, హాజరైన అధికారులు

## పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయాలి

**వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదేశాలు**

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీపై వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు గురువారం గుంటూరు లోని క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జులై ఒకటో తేదీన ఉదయం 6. 00 గంటల నుండి పెన్షన్ల పంపిణీ మొదలు పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. నిబంధనల ప్రకారం ప్రస్తుతం ఉన్న పింఛన్‌దారులందీరికి ఒకటో తేదీన ఇవ్వాలని మిగిలిన వారికి రెండో తేదీన ఎట్టిపరిస్థితుల్లో పూర్తి చేయాలన్నారు. పెంచిన సొమ్ముతో సహా ఒక్కొక్కరికి రూ.7 వేలు ఇవ్వాలన్నారు. ఇంటింటికి గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులు వెళ్లి పెన్షన్ పంపిణీ చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీ నిమిత్తం ఒక్కొక్క ఉద్యోగికి 50 ఇళ్లు కేటాయించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

## ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

**ప్రజాశక్తి-గుంటూరు**

ఆనంద జీవితానికి ఆరోగ్యంపై నిరంతర శ్రద్ధ తప్పనిసరి అని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎన్.అనిత పేర్కొన్నారు. గురువారం చౌడవరంలోని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో ఉమెన్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో కళాశాలలోని విద్యార్థినులు, మహిళా అధ్యాపకులకు ఆరోగ్యరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్టార్ రమేష్ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ అనిత నెలకుదిటి మాట్లాడుతూ మహిళలలో అధికంగా తలెత్తే వివిధ రకాల అనారోగ్య సమస్యల గురించి వివరించి, వాటికి గల కారణాలు తెలియజేస్తూ వాటి నివారణకు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోషక ఆహార అలవాటు, నిరంతర వ్యాయామం, ధ్యానం వంటివి శారీరక ధారుఢ్యంతోపాటు మనస్సును ఉత్తేజ పరుస్తుందన్నారు. ప్రస్తుతం విద్యార్థుల్లో ఏర్పడిన పోటీతత్వంలో మానసిక ఒత్తిడి అధిగమించేందుకు ఆహార వ్యాయామ నియమాలు పాటించాలని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. విద్యార్థి దశ నుండే బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపటం అవసరం అని సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, ఉమెన్ వెల్ఫేర్ కమిటీ కన్వీనర్ డాక్టర్ కె.రాధారాణి తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌విఆర్ కళాశాలలో ఆరోగ్యరక్షణపై మాట్లాడుతున్న డాక్టర్ అనిత

## వర్సిటీలో ముగిసిన ఏపీ పీసెట్ పరీక్షలు

**ప్రజాశక్తి - ఎఎన్‌యు**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ0 గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఏపీపీసెట్ 2024 దేహ దారుఢ్య పరీక్షలు గురువారం సజావుగా ముగిశాయని ఏపీ పీ సెట్ 2024 కన్వీనర్ ప్రొఫెసర్ పి. జాన్సన్ తెలిపారు. చివరి రోజు మహిళా అభ్యర్థులకు పరీక్షల నిర్వహించినట్లు పేర్కొన్నారు. మొత్తం 505 మహిళా అభ్యర్థులకు గాను 339 మంది అభ్యర్థులు హాజరైయ్యారు. ఈ పరీక్షల నిర్వహణలో విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య సిబ్బంది, తమ తమ విభాగాల నుంచి పరీక్షలకు వచ్చిన అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా తగిన సహాయ సహకారాలను అందించారు. ఈ పరీక్షలకు రాష్ట్రం నలుమూలల నుండి బీపీయిడి కోర్సుకు 951 మంది యూజీ డిపిఈడి డిప్లమో కోర్సుకు 145 మంది కలిపి మొత్తంగా 1096 హాజరు అయ్యారు. వివిధ విశ్వవిద్యాలయాలు మరియు అనుబంధ కళాశాల వ్యాయామ అధ్యాపకులు, పీ సెట్ కమిటీ సభ్యులను పర్యవేక్షకులుగా వ్యవహరించారనీ ప్రొఫెసర్ జాన్సన్ వివరించారు.



